ఉపాధి పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని కరీముఖిపుట్ పంచాయతీ తాంగుల గ్రామంలో ఉపాధి పనులను గిరిజన సంఘం నాయకులు గల్లేల జీనబంధు పరిశీలించారు. అనంతరం. ఆయన మాట్లాడుతూ, ఉపాధి పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంటు, తాగునీరు వంటి సౌకర్యలు కల్పించాలన్నారు. పని దినాలు 200 రోజులు పెంచాలని, ఉపాధి వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారుల జాప్యంతో వేతనాలు సకాలంలో చెల్లించలేకపోతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు జి నారాయణ, ఉపాధి కూలి సంఘం నాయకులు జి కేశ్వరావు, టీ.మహేశ్వరావు, దేవి పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న గిరిజన సంఘం నేత

అంగన్‌వాడీ వర్కర్లకు గ్రాడ్యూటీ చెల్లించాలి

-ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అంగన్‌వాడీ వర్కర్లకు గ్రాడ్యూటీ చెల్లించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. అరకువేలి శారదానికేతన్ స్కూల్లో ఈ నెల 26న ప్రారంభమైన అంగన్‌వాడీ హెల్పర్ల రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ, 2022 ఏప్రిల్ 25న అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అంగన్‌వాడీ వర్కర్లకు గ్రాడ్యూటీ చెల్లించాలని, గ్రాడ్యూటీ చట్టం- 1972 అమలు చేయాలని, గౌరవవేతనాన్ని వేతనంగా పరిగణించాలని కోరారు. సుప్రీంకోర్టు ఈ తీర్పునిచ్చి ఏడాది గడుస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. సంవత్సరాల తరబడి సేవలందిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు ఉద్యోగ విరమణ తర్వాత ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో బతుకు భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాడ్యూటీ చెల్లించాలని డిమాండ్ చేశారు.

యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబీరాణి మాట్లాడుతూ, అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఆ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్తులో పెద్దఎత్తున ఉద్యమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు రమ, శ్రీదేవి, దుర్గారాణి, జిల్లా నాయకులు దురియ నాగమ్మ, పి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

హాజరైన అంగన్‌వాడీ హెల్పర్లు

పథకాలను వివరిస్తున్న సుభద్ర, ఫాల్గుణ

అర్హులకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - పెదబయలు : మండలంలో సీతగుంట గ్రామంలో ఆదివారం అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ, ఉమ్మడి జిల్లా ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పర్యటించారు. గడప గడప కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తిరిగారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకొన్నారు. గ్రామంలో మహిళలు బోర్‌వెల్, సిసి రహదారులు, డ్రైనేజ్ మంజూరు చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ సుభద్ర మాట్లాడుతూ, గడప గడప కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పి.మాధవరావు, ఎంపీటీసీ కే బొంజుబాబులు పలు సమస్యలు తెలియజేశారన్నారు. ఈ మేరకు నివేదికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ ఎల్,పూర్ణయ్య, పిఆర్ ఇంజినీర్‌ను ఆదేశించారు. ప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కొర్ర రాజుబాబు, మండల కన్వీనర్ ఆనందరావు, అనంతరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు

నిర్వాసితులను మోసగిస్తే పోరు తప్పదు

సిపిఎం మండల కార్యదర్శి చిన్నబాబు

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం నిర్వాసితులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసగిస్తే పోరాటం తప్పదని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు హెచ్చరించారు. మండలంలోని ముద్దులగూడెం గ్రామంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగాలు చేస్తున్న నిర్వాసితులకు ప్యాకేజీ, పునరావాసంతో పాటు మొదటి ప్రాధాన్యతగా సర్వేలు చేయాలన్నారు. కాంటూరు కాకి లెక్కలను పక్కన పెట్టి ముంపునకు గురయ్యే ప్రతి గ్రామాన్నీ గుర్తించి ఇళ్లకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించాలని కోరారు. ఈ ఏడాదైనా గోదావరి వరదల రాకముందే పోలవరం ప్రాజెక్టు ముప్పు గ్రామాల ప్రజల ఇబ్బందులకు గురికాకుండా నిర్వాసితుల ప్రాంతాల్లో పునరావాస చర్యలు చేపట్టాలని కోరారు. వరదలతో అసౌకర్యం కలగకుండా సహాయక చర్యలు చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ముప్పు ప్రాంతాల్లోని ఎనిమిది మండలాల ప్రజలు ఎలాంటి అభివృద్ధి, సంక్షేమానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై జూన్ 20 నుండి సిపిఎం ఆధ్వర్యాన రేఖపల్లి నుండి విజయవాడ వరకు మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో 8 మండలాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ఈ పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల నాయకులు పంకు సత్తిబాబు, సోడే మల్లయ్య, కుంజా కన్నయ్య, వార్డు మెంబర్ కారం పార్వతి, సోడే చంద్రారావు, తెల్లం పుల్లయ్య, సోడే శ్రీరామ్మూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధిలో పండ్ల తోటల పెంపకం

-జాబ్ కార్డుదారులకు మొక్కలు పంపిణీ
-ప్రజాశక్తితో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పాడేరు అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ గిరిబాబు

ప్రజాశక్తి-పాడేరు: ఈ ఏడాది పాడేరు ఏజెన్సీలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఈ పథకం పాడేరు అదనపు ప్రాజెక్టు డైరెక్టర్(ఏపీడి) జవ్వాది గిరిబాబు వెల్లడించారు. ఏజెన్సీలో ప్రాంతాన్ని బట్టి సాగుకు అనుకూలమైన పండ్ల రకాలను గుర్తించి లబ్ధిదారులకు మొక్కలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పథకం ద్వారా చేపడుతున్న ఉద్యాన తోటల పెంపకానికి తీసుకుంటున్న చర్యలపై తెలిపిన సమాచారం ఆయన మాటల్లోనే...

ఉద్యాన తోటల పెంపకం లక్ష్యం?

పండ్ల తోటల పెంపకం ద్వారా ఉపాధి కూలి పనులు కల్పించడంతో పాటు ఫల సాయం ద్వారా లబ్ధిదారులకు ఆదాయం కల్పించడం. గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం నింపడం ప్రధాన ఉద్దేశం. ఏజెన్సీ వ్యాప్తంగా ఉద్యాన పండ్ల తోటలను విస్తరించి గిరిజనులకు ఉపాధి అవకాశాలను మరింత మెరుగు పరిచేందుకు ఉపాధి పథకం లబ్ధిదారులందరికీ మొక్కలు పంపిణీ చేయాలని లక్ష్యంతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు ఇచ్చారు

లబ్ధిదారులను ఏ విధంగా గుర్తిస్తున్నారు?

ఉపాధి జాబ్ కార్డులో ఉన్న లబ్ధిదారులందరూ కూడా ఈ ఉద్యాన తోటల పెంపకం పథకానికి అర్హులే. వారు సాగు చేసే భూమిని పరిశీలించి అనుగుణమైన మొక్కలు లబ్ధిదారుల సాగు విస్తీర్ణాన్ని బట్టి అవసరమైనన్ని మొక్కలు ఉచితంగా ఇస్తాం. మొక్కలు నాటడానికి గోతులు తవ్వడం మొదలుకొని, మూడేళ్ల పాటు ఈ ఉద్యాన తోటల పెంపకం నిర్వహణ కింద రైతులకు ఉపాధి పనులు కల్పిస్తాం. మెటీరియల్ కాంపోనెంట్ కింద నగదు సాయం కూడా లబ్ధిదారులకు అందుతుంది.

ఏ పండ్ల మొక్కలు పంపిణీ చేస్తారు?

ప్రస్తుతం జామ, స్వీట్ ఆరెంజ్, డ్రాగన్ ఫ్రూట్, దానిమ్మ, సీతాఫలం, నేరేడు, జీడి, చింత, సపోటా, తదితర పండ్ల రకాలను ఎంపిక చేసాము. అన్ని ప్రాంతాల్లో ఉపాధి లబ్ధిదారులకు ఈ మొక్కల పంపిణీ చేసేందుకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు ఇచ్చారు. జూన్, జూలై నెలల్లో ముమ్మరంగా మొక్కలు నాటే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

జాబ్ కార్డులున్న కుటుంబాలెన్ని ?

పాడేరు డివిజన్ 11 మండలాల్లో 1,42,393 జాబ్ కార్డులు ఉన్నాయి. పాడేరు మండలంలో 11335, అనంతగిరి 12250, అరకు 13987, చింతపల్లి 14,525, డుంబ్రిగుడ 13039, జి.మాడుగుల 12765, జీకే వీధి 11488 హుకుంపేట 14,515, కొయ్యూరు 13236, ముంచంగిపుట్టు 12145, పెదబయలు 13,108 ఉన్నాయి.



ఏ పనులకు ప్రాధాన్యతనిస్తున్నారు?

వాటర్ అబ్జర్వేషన్ ట్రెంచీలు, టెర్రాసింగ్ పనులతో పాటు భూమి చదును పనులు కల్పిస్తున్నాం. లబ్ధిదారులు ఉపాధి కింద వ్యక్తిగత పనుల కోసం మండల అభివృద్ధి అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా కలెక్టర్ ఆమోదం తీసుకుని ఆ పనులను మంజూరు చేయిస్తాం. ఉపాధి పథకంలో కమ్యూనిటీ పనుల కంటే వ్యక్తిగత పనులకే ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి. ఏడాది పొడుగునా ఉపాధి పనులు కల్పిస్తున్నాం. ప్రతి జాబ్ కార్డ్ పై వందరోజుల పని దినాలతో పాటు రోజు కూలి 272 రూపాయలు చెల్లిస్తున్నాం.

అదనంగా పని దినాలు కల్పిస్తున్నారా?

ఆర్ఓఎఫ్ఆర్ పట్టా కలిగిన లబ్ధిదారులు జాబ్ కార్డులో నమోదు చేసుకొని 50 రోజులు అదనంగా పని దినాలు పొందవచ్చు. మండల స్థాయిలో ఎండిఓ, ఏపీఓలను సంప్రదించి జాబ్ కార్డులో ఎంట్రీలు వేసుకొని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి.

సమ్మేళనంలో పాల్గొన్న 1989 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 34 ఏళ్ల తర్వాత ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 1989లో చదివిన 50 మంది పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా వచ్చి ఒకరికొకరు ఆత్మీయ పలకరించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువర్యులు తేజోమూర్తుల వెంకటేశ్వర శర్మ దంపతులను, అంబిటి వీరభద్రరావు, సూర్యనారాయణ మూర్తిని దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు. బుంగా రాజకుమార్, నమ్మి శ్రీనివాస్, అంబిటి లక్ష్మణరావు, ఎం.వి రాఘవులు, గంగబాబు, మురళి, ఉదయభాను తదితరులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

అవార్డు అందుకుంటున్న పైడి నవనీత్

నవనీత్‌కు ప్రతిభ పురస్కార అవార్డు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: 2022-23 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 528 మార్కులు సాధించి అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండల టాపర్ గా నిలిచిన ముగ్గు పైడి నవనీత్ ఎపి ఐక్య జంగమ సంక్షేమ సంఘం నుంచి ప్రతిభ పురస్కార అవార్డు అందుకున్నారు. ఆదివారం విశాఖపట్నం డాబా గార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆత్మీయ కలయికలో నవనీత్‌ను అభినందించి ప్రతిభా పురష్కార అవార్డును అందించారు. పాడేరులో ఒక ప్రముఖ తెలుగు దినపత్రికలో వివేఖరిగా పని చేస్తున్న ముగ్గు మహేష్ బాబు తనయుడు నవనీత్ ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో చదువుకున్నాడు. 10 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో టాపర్లుగా నిలిచిన జంగమ కుటుంబానికి చెందిన 14 మంది విద్యార్థులను జంగమ రాష్ట్ర సంఘం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా నవనీత్‌కు రాష్ట్ర సంఘం ప్రతిభా పురస్కార అవార్డుతో పాటు రూ. 5వేలు నగదును ఆ సంఘం పెద్దల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో లోకనాథం, ఆనందరావు, గుంపు స్వామి, నర్సింగరావు, సూర్యనారాయణ, కోటేశ్వరరావు, నరేంద్ర, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు ఘాట్ రోడ్డులో విరిగిన చెట్టు

అర్ధరాత్రి నిలిచిపోయిన వాహనాలు

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్‌లో శనివారం అర్ధరాత్రి వీచిని ఈదురుగాలులు, భారీ వర్షానికి చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో అర్ధరాత్రి సమయంలో రహదారికి ఇరువైపులా వాహనాలు కారడవిలో నిలిచిపోయాయి. రెండు దారాలమ్మ ఆలయ సమీపంలో భద్రాచలం వెళ్లే నైట్ సర్వీస్ బస్సులు, కార్లు, లారీలు తదితరు వాహనాలు నిలిచిపోయాయి. ఎటూ వెళ్లేందుకు వీల్లేక కటిక చీకట్లో గంటల తరబడి వేచి ఉండవలసిన పరిస్థితి నెలకొంది. కొంతమంది కాలినడకన దారకొండ గ్రామానికి చేరుకొని గిరిజనులను నిద్ర లేపారు. వారు వెంటనే ద్విచక్ర వాహనాలపై సంఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును సుమారు గంటపాటు శ్రమించి తొలగించారు. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డుకడ్డంగా పడిన చెట్టును తొలగిస్తున్న స్థానికులు

బయట నిరీక్షిస్తున్న నైట్ హాల్ట్ బస్సు ప్రయాణికులు

శివ ప్రసాద్‌కు ధన్యవాదాలు తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న స్థానికులు

రేకుల ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించిన శివ ప్రసాద్

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని అంతాడ పంచాయితీ పరిధి తాటిమానుపాలెం గ్రామంలో రెండు నెలల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు దగ్ధమైన ఏడు కుటుంబాలకు నిర్మిస్తున్న రేకుల ఇళ్ల నిర్మాణాలను అరకు ఎంపీ గొడ్డేటి మాధవి భర్త, నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ ఆదివారం పరిశీంచారు. నాటి అగ్ని ప్రమాదంలో నాలుగు ఇళ్లు దగ్ధం కాగా ఏడు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. నాడు శివ ప్రసాద్ బాధితులను పరామర్శించి రేకుల ఇళ్లు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు రూ.2లక్షలతో రేకుల ఇళ్ల నిర్మాణం చేయడం జరుగుతుంది. వాటిని ఆదివారం ఆయన పరిశీలించారు. ఇళ్ల వద్ద బోర్ వెల్ కూడా కావాలని స్థానికులు కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి తన సొంత డబ్బుతో బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు రేకుల ఇళ్లు నిర్మిస్తున్న శివ ప్రసాద్‌కు రుణపడి ఉంటామని బాధితులు ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీకి తప్పని వెతలు

4 కిలోమీటర్లు డోలీలో ప్రధాన రోడ్డుకు..108లో ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి -హుకుంపేట: రహదారి సౌకర్యం లేక నిండు గర్భిణిని నాలుగు కిలోమీటర్ల వరకు డోలి మోతతో తీసుకొచ్చన సంఘటన మండలంలోని గత్తుం పంచాయతీ గాలిపాడు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గాలిపాడు గ్రామనికి చెందిన జాన్ని కొండమ్మ ఆదివారం పురిటి నొప్పులతో ఆస్పత్రికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ముందుగా అంబులెన్స్ సిబ్బందికి ఫోన్ చేయగా గాలిపాడు గ్రామం వరకు రాదని, గత్తుం గ్రామ పంచాయతీ కి రావాలని వారు సూచించారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో నడిచే వెళ్లేందుకు వీలు లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ఆమె భర్త నలుగురు వ్యక్తుల సాయంతో రెండు కర్రలకు దుప్పటి కట్టి డోలిలో గాలిపాడు గ్రామం నుంచి గత్తుం గ్రామ పంచాయతీ వరకు నాలుగు కిలోమీటర్లు ఏకధాటిగా కాలిబాటలో నడుచుకుంటూ గర్భిణీని మోసుకొచ్చారు. అక్కడి నుంచి 108 వాహనాంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమో ఆరోగ్యం బాగానే వుందని వైద్యులు తెలిపారు.గలిపాడు గ్రామంలో రహదారి సౌకర్యం కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి వి.లక్ష్మణ రావు డిమాండ్ చేశారు. రహదారి తదితర సమస్యలతో అనేక అవస్థలు పడుతున్నారని ఆయన అన్నారు.

108లో తరలిస్తున్న కుటుంబీకులు

ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలు

ప్రజాశక్తి- పెదబయలు రూరల్

మండల కేంద్రంలో కీర్తిశేషులు నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలను టిడిపి పార్టీ అధ్యక్షురాలు సీకరి. సుకుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జెండాను మండల అధ్యక్షురాలు సీకరి సుకుమారి ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలను వేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నటన రంగంలోనే కాకుండా రాజకీయరంగంలో కూడా ఎన్‌టిఆర్ తనదైన ముద్రను వేసుకున్నారన్నారు. తెలుగుదేశం పార్టీని స్థాపించిన కొద్ది రోజుల్లోనే ప్రజల మన్ననలు పొంది ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన మహానేత నందమూరి తారక రామరావు అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు టి.త్రినాద్, కే.భూషణం, ఎల్. త్రినాథరావు, చందర్‌రావు, రవి, రాజారావు, బాలు, తిరుపతి పాల్గొన్నారు.

రంపచోడవరం : టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టి.రామారావు శతజయంతి సందర్భంగా రంపచోడవరం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు ఆదివారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి సరికొత్త అర్థం తెచ్చిన యుగ పురుషుడు ఎన్‌టి. రామారావు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కారం సురేష్ బాబు, దిండి జనార్ధన్, దార వెంకన్న, కొండబాబు, మడి నరసన్న దొర, కోసు నాగన్న దొర, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీతంశెట్టి

రోడ్డు ప్రమాదంలో ఆశా కార్యకర్త మృతి

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని మర్రివాడ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆశా కార్యకర్త మృతి చెందారు. బూదరాళ్ల గ్రామానికి చెందిన నాగమణి ఆశా కార్యకర్తగా పని చేస్తున్నారు. నాగమణి ఆదివారం దొడ్డవరం నుంచి ఆటోలో బూదరాళ్ల వెళుతున్న సమయంలో మర్రివాడ సమీపంలో ఆటో ఆవును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నాగమణి అక్కడికక్కడే మృతి చెందారు. మరికొందరు గాయపడ్డారు. క్షతగాత్రులను రాజేంద్రపాలెం పీహెచ్‌సీకి తరలించారు. క్షతగాత్రులను ఎంపీపీ బడుగు రమేష్ పరామర్శించారు.

వర్షానికి చల్లబడిన వాతావరణం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలో వారం రోజుల నుంచి విపరీతమైన ఎండలు కాస్తున్న నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల వరకు వర్షం కురవడంతో ప్రజలు సేద తీర్చుకున్నారు. ఇలా మధ్య మధ్యలో వర్షం పడితే ఇబ్బంది లేకుండా ఉంటుందని పలువురు అంటున్నారు. ఏది ఏమైనా ఆదివారం మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది.

కొయ్యూరులో కురుస్తున్న వర్షం

ఘటాలు మోస్తున్న సుభద్ర, ఫాల్గుణ తదితరులు

ఘనంగా మోదకొండమ్మ జాతర

ప్రజాశక్తి-పెదబయలు :మండల కేంద్రంలో మోదకొండమ్మ జాతరను ఉత్సాహ కమిటీ అధ్యక్షులు మజ్జి చంద్రబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ కుంభ రవిబాబు, ఉమ్మడి జిల్లా చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణలు మోదకొండమ్మ ఘటాలు ఊరేగించి శతకంపట్టు వద్ద ప్రతిష్టించారు.

'జి20 దేశాలలో మహిళా సాధికారికతకు భారత్ మార్గదర్శకం'

ప్రజాశక్తి-విశాఖపట్నం : మహిళాసాధికారికత, ఆర్థిక ప్రగతిలో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే ఆయాదేశాలలో వృద్ధి కనబడుతుందని, దీనికి గాను భారతదేశం త్వరలో అధిక్యం వహిస్తున్న జి20 సమావేశాలలో మార్గదర్శకం చేయాలని విశాఖ స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్‌సి.పాండే పేర్కొన్నారు. భారత ప్రజాసంబంధాల సంఘం (పిఆర్‌ఎస్‌ఐ) విశాఖ శాఖ, విశాఖ స్టీల్‌ప్లాంట్ సంయుక్తంగా ఆదివారం 'జి20 మహిళాసాధికారికత-భారతదేశ పాత్ర అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతదేశం గతకొద్ది సంవత్సరాలుగా అమలు చేస్తున్న నారీశక్తి వంటి పలు మహిళా పథకాలు లింగ అసమానతత్వాన్ని తగ్గించాయని, నవతరం మహిళా పారిశ్రామిక వేత్తలు, శాస్త్ర వేత్తలు వృద్ధి చెందడానికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. ప్రముఖ ఆర్థిక నిపుణులు, గీతం విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాధా రఘు రామ పాత్రుని మాట్లాడుతూ, మహిళల భాగస్వామ్యం లేనిదే ప్రపంచం ఆర్థికంగా ప్రగతి సాధించలేదని, దీనిని జి20 దేశాలు గుర్తించాలని చెప్పారు.

'పార్లమెంట్ భవనాన్ని మోడీ ప్రారంభించడాన్ని వ్యతిరేకించడం సరికాదు'

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రధాని మోడీ ప్రారంభించడాన్ని కొన్ని పార్టీలు వ్యతిరేకించడం సరికాదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. రాజస్థాని మండలిలో ఆదివారం బిజెపి ఆధ్వర్యంలో ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం అనంతరం సోము వీర్రాజు మీడియాతో మాట్లాడుతూ, ద్రౌపది ముర్మును రాష్ట్రపతి పదవికి బిజెపి ప్రతిపాదిస్తే, ఆమెకు ఆ పదవి ఇవ్వకూడదంటూ వ్యతిరేకించిన రాజకీయ పార్టీలే ఇపుడు నూతన పార్లమెంట్ భవనాన్ని ఆమెతో ప్రారంభింపచేయలేదని విమర్శించడమేమిటన్నారు. ఎన్టీఆర్ గొప్పతనాన్ని మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ ప్రస్తావించారని, ఇది తెలుగు వారందరికీ గర్వకారణం అన్నారు. ఏపిలో జనసేన పార్టీ తమతో ఉందని, మిగిలిన పార్టీల ప్రతిపాదనలను కేంద్ర పార్టీ చూసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.విష్ణుకుమార్‌రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివిఎన్ మాధవ్, విశాఖపట్నం అధ్యక్షుడు ఎం.రవీంద్ర పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ఆర్థిక సాయం అందించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రభుత్వ రంగంలో నడుస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ పూర్తిస్థాయిలో సమర్థవంతంగా పనిచేయడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణసాయంగా రూ.5 వేల కోట్లు ఇవ్వాలని షిప్‌యార్డ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్ కోరారు. స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 787వ రోజుకు చేరాయి. దీక్షల్లో షిప్‌యార్డ్, బిహెచ్‌ఇఎల్ ఉద్యోగులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్‌లో కొన్ని యూనిట్లను మూసివేస్తూ ఉద్దేశపూర్వకంగానే ఉత్పత్తిని తగ్గించేలా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు సమకూర్చాలని డిమాండ్‌చేశారు.

అరకులోయ, అనంతగిరి మండలాల్లో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు

రహదారులు అస్తవ్యస్తం

ప్రజాశక్తి-యంత్రాంగం

అరకులోయరూరల్: మండలంలోని పద్మపురం మేజర్ పంచాయతీ యండపల్లివలస గర్ల్స్ ఏపీఆర్‌కు వెళ్ళే రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు మరమ్మతులు గురై రాళ్లు తేలి పోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు గుండా గర్ల్స్ ఏపీఆర్, కేజీబీవి, బీముడు వలస, రణజిల్డ, దుమ్మగుడకాలనీ, దుమ్మగుడ, పింపోల్గుడ, గ్రామ గిరిజనులు రాకపోకలు చేస్తుంటారు. రణజిల్డ వాటర్ పాల్ చూసేందుకు వచ్చే పర్యాటకులు నిత్యం భారీ వాహనాలతో రాకపోకలు చేస్తుంటాయి. రోడ్డు పాడై ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో రోడ్డు కోతకు గురి అయ్యి రాళ్లు తేలిపోయి ఉండడంతో రహదారిపై ప్రయాణం చేయడం కష్టంగా ఉందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆ ప్రాంత ప్రజలతో పాటు వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గిరిజన వాహనచోదకులు కోరుతున్నారు.

అనంతగిరి:మండలంలోని మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షం కారణంగా మట్టి రోడ్లంతా గోతులుగా ఏర్పడి రాళ్లు పైకి రావడంతో రాకపోకల సాగించే వాహన చోధకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అనంతగిరి పంచాయతీ పరిధి లక్ష్మీపురం మెయిన్ రోడ్డు నుండి రాజుపాక, అరకు మెయిన్ రోడ్ నుండి బొరజోల, అనంతగిరి పెద్దూరు నుండి మాలింగవలస మీదుగా రేగం, నందిగుమ్మి, నిమ్మలపాడు మెయిన్ రోడ్డు వరకు వలసి పంచాయతీ జండాగరువు నుండి ఉటగెడ్డ, నిమ్మలపాడు మెయిన్ రోడ్డు నుండి గొర్రెగుమ్మి, .జోర్లగడ్డ కొండిబ పంచాయతీ పరిధి సింగర్భ, కప్పటివలస, బోరింగ్ వలస కొనుకొండ, వాలసి పంచాయతీ పరిధి కరకవలస మీదుగా చిడివలస తదితర గ్రామాల్లో రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి తారు రోడ్లు మంజూరు చేయాలని ఆయా గ్రామాల గిరిజన ప్రజలు కోరుతున్నారు.

విరబూసిన డ్రాగన్ ఫ్రూట్

ప్రజాశక్తి- అనంతగిరి:ఈ ఏడాది డ్రాగన్ ఫ్రూట్ అధికంగా దిగుబడి నిచ్చింది. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన మండలంలోని ఎగువశోభ పంచాయతీ మర్రిగుడ గ్రామంలో అరకు రోడ్డుకు ఆనుకొని ఈ డ్రాగన్ ఫ్రూట్ అడ్వాన్స్ పార్క్ లో ఉంది. ఈ తోట పెంపకం తూర్పు కనుమలు భూ సారమైన చల్లటి ప్రాంతంలో తోట పెంపకం ఉంటుంది. జూలై నెల నుండి సెప్టెంబర్ నెలలో నాలుగు నెలలో ఐదు దఫాలుగా ఫ్రూట్ లభిస్తాయి. వీటికి విదేశీ ప్రాంతంలో గిరాకీ ఉంది.

మృతి చెందిన పశువులు

పిడుగుపడి పశువులు మృతి

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని ఆదివారం మెరుపులతో కూడిన ఈదురు గాలుల కారణంగా పిడుగుపాటుకు గురై రెండు పశువులు మృతి చెందాయి. మండలంలోని కొత్తూరు పంచాయతీ కట్టవలస గ్రామానికి చెందిన గరిడిపల్లి. రాముకు రెండు పశువులు మేత కోసం కాశీపట్నం వెళ్లాయి. వర్షం కారణంగా కాశీపట్నం సమీపంలో చెట్టు కిందకు పశువులు చేరాయి. వీటిపై ఒక్కసారిగా భారీ మెరుపులతో కూడిన పిడుగుపడటంతో రెండు పశువులు అక్కడికక్కడే మృతవాతకు గురయ్యాయి.

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

పరవాడ పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోని ప్రభుత్వ భూమి ప్రయివేటు వ్యక్తుల వశమవుతోంది. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు కళ్లమూసుకోవడంతో ప్రయివేటు వ్యక్తులకు ఆక్రమణలు సులవయ్యాయి. గాజువాక-యలమంచిలి ప్రధాన రహదారికి రెండువైపులా 297 సర్వే నెంబరులో 76 సెంట్లు, 293 సర్వే నెంబర్‌లో ఎకరా 36 సెంట్లు భూమిలో నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేస్తున్నారు.

297, 293 సర్వే నెంబర్లలోని రెండెకరాల 12 సెంట్లు భూమి విలువ రూ.18 కోట్లకుపైగా ఉంది. ఇంత విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణల పాలవుతున్నా, ప్రయివేటు వ్యక్తులు శాశ్వత భవనాలు నిర్మించి వ్యాపారాలు నిర్వహిస్తున్నా పట్టించుకోకపోవడంతో రెవెన్యూ అధికారుల తీరుపై అనేక అనుమానాలు, విమర్శలు తలెత్తుతున్నాయి. ఈ భోనంగి రెవెన్యూ గొర్లివానిపాలెం గ్రామ పంచాయతీ సర్వేనెంబర్ 293లో ఎకరా 36 సెంట్లులో గెడ్డవాగుగా ప్రభుత్వ రికార్డుల్లో నమోదైంది. 2018లో ఈ వాగును ప్రయివేటు వ్యక్తి గ్రావెల్‌తో పూడ్చుతున్న విషయం అప్పటి తహసీల్దార్ పిఎవిఎస్ మల్లేశ్వరరావుకు స్థానికులు ఫిర్యాదు చేశారు. స్థానికుల ఫిర్యాదుపై ఈ భూమిని తహశీల్దార్ పరిశీలించారు. ఇది ప్రభుత్వానికి చెందిన భూమంటూ, అనుమతి లేకుండా ప్రవేశించిన, ఆక్రమించ డానికి ప్రయత్నించినా సెక్షన్ 4(1), 4(2), 4(3) ఎపి ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ 1982 ప్రకారం చర్యలు తీసుకుంటామని అప్పట్లో కలెక్టర్ పేరున హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. కలెక్టర్ హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసిన ప్రభుత్వభూమిని ప్రస్తుత తహశీల్దార్ వి.ప్రకాశరావు జిరాయితీగా నమోదు చేసి రైతులపేర మ్యూటేషన్ చేయడం వివాదస్పంగా మారింది. వాగును గ్రావెల్‌తో పూడ్చిన విషయం స్థానికులు ఫిర్యాదుచేయడంతో వెబ్ ల్యాండ్‌లో రెడ్ మార్క్ పెట్టి రైతులకు నోటీసులు ఇచ్చి తహశీల్దార్ కొత్త వివాదానికి తెరలేపారు.

సర్వేనెంబర్ 297లో 76 సెంట్లు ప్రభుత్వ రికార్డులలో వాగుగా నమోదుచేశారు. పరవాడ రెవెన్యూ సర్వే నెంబరు 11లోని కొండ నుంచి వచ్చే వర్షపు నీరు ఈ వాగుల గుండా సర్వే నెంబర్ 292లోని ఈతల చెరువుకు చేరేది. 1956-57 సర్వే సెటిల్మెంట్ ప్రకారం సర్వేనెంబర్ 297, 293లోని విస్తీర్ణం వాగులుగా నమోదయ్యాయి. అయితే గతంలో పనిచేసిన తహశీల్దార్ గంగాధరరావు సర్వేనెంబర్ 297లోని 76 సెంట్లు గెడ్డ వాగుకు ఆన్ లైన్, వెబ్‌ల్యాండ్‌లో జిరాయితీగా నమోదు చేశారు. వాగును గ్రావెల్‌తో పూడ్చి కొబ్బరిమొక్కలు వేయడంపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో ఆన్ లైన్ రికార్డులలో రెడ్ మార్క్‌లో పెట్టారు. ఎస్‌ఎఫ్‌ఎ, ఎస్-ఎల్‌ఆర్, ఫీల్డ్ మెజర్మెంట్ బుక్, రెవిన్యూ విలేజ్ మ్యాప్‌ను పరిశీలించి రెవెన్యూ రికార్డులో హక్కుదారుల పేర్లను నమోదు చేయాల్సివుంది. డబ్బులకు కక్కుర్తిపడ్డ రెవెన్యూ అధికారులు, వాగులను జిరాయితీ భూములుగా మార్చి ప్రయివేటు వ్యక్తుల పేరిట రికార్డుల్లో నమోదుచేసి ఆక్రమణలకు సహకరిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి సర్వే నెంబర్ 293, 297 గెడ్డవాగుల ఆక్రమణలు తొలగించి, ఈతలచెరువుకు నీరు చేరేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిని రెవెన్యూ రికార్డుల్లో జిరాయితీగా కొంతమంది వ్యక్తుల పేర నమోదుచేయడంపై తహసీల్దార్ వి.ప్రకాశరావు వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా, సర్వే నెంబరు 293 ఇనాం భూమి అని పేర్కొన్నారు. తహసీల్దార్ పిఎవిఎస్ మల్లేశ్వరరావు ఈ భూములను ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డు పెట్టడడంతో ఈ గందరగోళం ఏర్పడిందన్నారు.

క్రికెట్ విజేత చేపలుప్పాడ జట్టు

విజేతలకు కప్ అందజేస్తున్న వైస్ ఎంపిపి ధనలక్ష్మి

ప్రజాశక్తి -ఆనందపురం : ముత్యాలమ్మ మరిడిమాంబ పండగ సందర్భంగా మండలంలోని వెల్లంకి పంచాయతీ, గారపేటలో శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగిసాయి. 15 రోజులపాటు, 50 క్రికెట్ జట్లు పాల్గొన్న ఈ టోర్నీ విజేతగా చేపలుప్పాడ జట్టు నిలిచింది. రన్నరప్‌గా బోయిపాలెం జట్టు నిలిచింది. విజేతలకు రూ.15వేలు, రన్నరప్‌కు రూ.పది వేలు నగదు బహుమతితోపాటు ట్రోఫీలను వైస్ ఎంపిపి బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ అందజేశారు. ఈ టోర్నీలో బహుమతులకు అవసరమైన ధనాన్ని వైస్ ఎంపిపి బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ, ఉపసర్పంచ్ కంచరపు శ్రీనివాసరావు, తాళ్లవలస ఎంపిటిసి కోరాడ రమణ, వెల్లంకి ఎంపిటిసి పడాల అప్పలనాయుడు సమకూర్చారు. బహుమతి ప్రదానోత్సవంలో శ్రీకృష్ణ యాదవ యూత్ సభ్యులు, గ్రామపెద్దలు, పైడితల్లి రామకృష్ణ గోవింద, నర్సింగరావు పాల్గొన్నారు

సేవల్లో ఆదర్శంగా నిలవాలి

మజ్జిగ పంపిణీ చేస్తున్న కళింగ యూత్ జూనియర్స్

ప్రజాశక్తి- మాధవధార: కళింగ యువత సేవా కార్యక్రమాలు చేస్తూ పలువురుకి ఆదర్శంగా నిలవాలని మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నంబాళ్ల ఈశ్వరరావు పిలుపునిచ్చారు. వేసవి దృష్ట్యా మాధవ యువజన సమాజం ఆవరణలో, మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు నెలలుగా నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రంలో వద్ద ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు నంబాళ్ల ఈశ్వరరావు మాట్లాడుతూ, మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, జూనియర్ సభ్యుల ఆర్థిక సాయంతో ఏటా వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఆనవాయితీగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ వారం దాతల సహకారంతో జూనియర్ సభ్యులు చలివేంద్రాన్ని విజయవంతంగా నిర్వహించడంపై అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

ఘనంగా అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయంలో నిత్య కల్యాణాన్ని ఆలయ అర్చకులు ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా నిర్వహించే తిరువీధి ఉత్సవంలో భాగంగా దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు పాల్గొని స్వామి పల్లకిని మోసారు. కల్యాణం అనంతరం వేడుకలో పాల్గొన్న భక్తులకు స్వామి దర్శనానికి కల్పించి, ప్రసాదాన్ని, జాకెట్‌ను, కండువాలను ఆలయ అధికారులు అందించారు.

విజయవంతమైన వేసవి శిబిరం

త్రిఫ్ట్‌సొసైటీ, విసిసి ఆధ్వర్యాన నిర్వహణ ... ఉత్సాహంగా పాల్గొన్న సొసైటీ సభ్యుల పిల్లలు

సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న త్రిఫ్ట్ సొసైటీ సభ్యుల కుటుంబాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ త్రిఫ్ట్ సొసైటీ, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన సొసైటీ సభ్యుల పిల్లలకు రెండు రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంప్ విజయవంతమైంది. ఆదివారం ఉక్కునగరం సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ పరిసర ప్రాంతాల నుంచి 70 మంది సొసైటీ సభ్యుల పిల్లలు పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ఈ క్యాంపులో సమాజ పరిణామ క్రమం, శాస్త్రీయ ఆలోచన, నిత్యజీవితంలో సైన్సు, ఆచరణ, పిల్లల కోసం ఎందుకు పనిచేయాలి అనే అంశంపై వివరించారు. దీనితో పాటు గ్రూపు ఆక్టీవిటీలు, మైమ్, క్రాఫ్ట్, డాన్సు, పాటలు, పొడుపు కథలు విప్పి చెప్పడం వివిధ రకాలైన అంశాల్లో అవగాహన పోటీలను నిర్వహించారు. విజ్ఞాన అంశాలను డిసిహెచ్. వెంకటేశ్వరరావు, ఎవి.సత్యనారాయణ వివరించారు. విసిసి కన్వీనర్ కె. సుశీల, కె. రమాప్రభ పర్యవేక్షణలో కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ సందర్భంగా సొసైటీ సెక్రటరీ పి నారాయణరావు మాట్లాడుతూ పిల్లలకు విజ్ఞానంతోపాటు వినోదాన్ని అందించే లక్ష్యంతో అనేక కార్యక్రమాలు రూపొందించామని వెల్లడించారు. పిల్లల్లోని ప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.సమ్మర్ క్యాంపులో పాల్గొన్న పిల్లలకు విసిసి తరపున జ్ఞాపికలు అందజేశారు. డైరెక్టర్లు కె.సత్యవతి, ఎ.అప్పారావు, జి.శ్రీనివాస్, డి.ప్రవీణ్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో నమ్మిదొడ్డి, పరవాడ, వడ్లపూడి, గంట్యాడ, శ్రీనగర్, మదీనాబాగ్, ఇస్లాంపేట, లక్మినగర్, శ్రీరాంనగర్ ప్రాంతాల పిల్లలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పర్యావరణ పరిరక్షణ సైకిల్ ర్యాలీ

ర్యాలీని ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పర్సనల్ డాక్టర్ పాండే

ప్రజాశక్తి- ఉక్కునగరం : ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలకు నాందిగా ఉక్కునగరం తృష్ణ గ్రౌండ్‌లో ఆర్ఐఎన్ఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పర్సనల్ డాక్టర్ ఎస్‌సి.పాండే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా "ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమ దైనందిన జీవితంలో సాధ్యమయ్యే అన్ని మార్పులను చేసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ, ప్రాముఖ్యతపై కుటుంబసభ్యులు, స్నేహితులు, ఇతరులను చైతన్యపరచడానికి నిరంతరంకట్టుబడి ఉండాలని సైకిల్ ర్యాలీలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. వచ్చేనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్న స్టీల్‌ప్లాంట్ పర్యావరణ నిర్వహణ విభాగాన్ని అభినందించారు. సహజ వనరులు, పర్యావరణం, వ్యక్తిగత ఆరోగ్యం కాపాడాలని నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. తృష్ణ మైదానం నుంచి, ఉక్కునగరం టౌన్‌షిప్‌లోని వివిధ సెక్టార్ల మీదుగా సాగిన ఐదు కిలోమీటర్ల సైకిల్ ర్యాలీలో పిల్లలు, యువకులు, పర్యావరణ నిర్వహణ విభాగం సీనియర్ అధికారులు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సైకిల్ ర్యాలీ పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలను ఉక్కు పర్యావరణ నిర్వహణ విభాగం ఇన్‌ఛార్జి, విభాగాధిపతి జి. ఫణికుమార్ అందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 32 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో మరోమారు ఆత్మీయ సమ్మేళనమయ్యారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికగా వివిధ ప్రాంతాల్లో వత్తి ఉద్యోగం వ్యాపారరీత్యా స్థిరపడిన వారంతా అక్కడికి చేరుకుని కలుసుకున్నారు. ఈసందర్భంగా ఒకరినొకరు పలకరించుకుని, పరస్పరం ఆలింగనం చేసుకుని, క్షేమసమాచారాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశలో జరిగిన జ్ఞాపకాలను జ్ఞప్తికి తెచ్చుకొని సంతోషంగా గడిపారు. తోటి మిత్రులు ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలుసుకొని హర్షాన్ని వ్యక్తం చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

గోపాలపట్నంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

వ్యక్తిగత ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు, 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవిందు అన్నారు. ఆదివారం దుర్గా గణపతి గుడి సీతంపేట యశోదాకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో, అమెరికన్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పనిఒత్తిడి కారణంగా పనుల్లో బిజీగా ఉండడం వల్ల ప్రస్తుతం అనేకమంది తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇది ఎంతమాత్రం మంచిదికాదన్నారు. వ్యక్తిగత ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. ఈ సందర్భంగా 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ .బి. శ్రీకాంత్ జనరల్ ఫిజీషియన్స్ డాక్టర్ జాన్ సూరజ్, డాక్టర్. సుగుణ ఆంకాలజిస్ట్ డాక్టర్ రవీంద్రకుమార్ పీడియాట్రీషియన్ డాక్టర్ సంతోష్ పాల్గొని వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ముద్దాడా ఎల్లాజీ, బీసపు శ్రీను, పిల్లల మోహన్, పల్లా పాపారావు, నాయుడు మాస్టర్, జోగ శ్రీను, ముద్దాడ శంకర్, పల్లా రాము, ఒమ్మి చిన్న, ఉప్పిలి అప్పన్న, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్వేషాలు కలిగించే ఫ్లెక్సీలపై ఫిర్యాదు

ప్రజాశక్తి -ఆనందపురం: ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా రాజకీయపార్టీలు ఫ్లెక్సీలు పెట్టడం, రెచ్చగొట్టే చర్యలు చేపట్టడం సరికాదని జనసేన పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ అన్నారు. ఆనందపురం కూడలిలో పవన్‌కల్యాణ్ చంద్రబాబులను ఉద్దేశించి, పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం అంటూ జగన్ ఫోటోతో వైసిపి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ ఆందోళన, ధర్నా చేపట్టారు. ఇటువంటి ఫ్లెక్సీల వల్ల శాంతియుతంగా ఉన్న ప్రజల మధ్య విబేధాలు రేగే అవకాశం ఉందని, ప్రజల్లో ద్వేషాలు రగిలించే చర్యలు చేపట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆధునికీకరించిన పిల్లల పార్కు ప్రారంభం

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో వార్డు అభివృద్ధి ప్రణాళిక నిధులు రూ.ఏడు లక్షలతో ఆధునికీకరించిన పిల్లల పార్కును వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె.రాజు ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని పార్కులన్నింటినీ అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తెస్తానన్నారు. అనంతరం దాడి రమణమూర్తి కల్యాణ మండపం వద్ద మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇఇ శ్రీనివాస్, ఎఇ రమణమ్మ, జక్కంపూడి సత్యనారాయణ, బైర వెంకట్, పారుపల్లి రవి, యన్.కుమార్, రమణ, నరేష్, రమణబాబు, సచివాలయం కన్వీనర్లు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, స్థానిక రెసిడెంట్స్, అసోసియేషన్ పెద్దలు పాల్గొన్నారు.

మత్స్యకారుల నిరసన

నిరసన చేపడుతున్న మతస్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి:హెటిరో డ్రగ్స్ కంపెనీ కొత్త పైపులైన్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మత్స్యకారులు డిమాండ్ చేశారు. పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన మహా శాంతియుత ధర్నా 543 రోజుల కు చేరింది. శిబిరం వద్ద ఆదివారం పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు గొంతిక పై కత్తులు పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ మత్స్యకారుల ఉపాధిని దెబ్బ కొట్టే పైపులైన్ కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడి నానాజీ, గోసల స్వామి, చేపలు సోమేష్, పిక్కి రమణ, బొంది నూకరాజు, మైలపల్లి దానరాజు, పిక్కి కోటి, వాసు పిల్లి దేముడు, పిక్కి కాశీ, కందాల నూకరాజుపాల్గొన్నారు.